


సమన్వయంతో సాగండి
● పీవోలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి
8
బ్యాంకులను బతికించండి
● గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ప్రతి ఓటూ... ప్రతిష్ఠాత్మకమే



- కొత్తగా చేరిన లక్ష ఓట్లు ● గత ఎన్నికలో చెల్లనవి అధికం
- కలసి కదులుతున్న కూటమి నేతలు
- సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు పీడీఎఫ్ యత్నాలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శ్రేణులతో సమీక్షలు
- పట్టభద్రులను కలసి మద్దతు కోరుతున్న అభ్యర్థులు

(నరసరావుపేట, గుంటూరు- ఆంధ్రజ్యోతి)

కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అధికారంలో ఉండటం. శాసనసభ ఎన్నికల్లో స్వీప్ చేయడంతో ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవశం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి బరిలో దింపింది. కూటమి హైకమాండ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు పీడీఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతోం ది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును పీడీఎఫ్ పోటీలో నిలిపింది. ఇటు కూటమి.. అటు పీడీఎఫ్ పట్ట భద్రులైన ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాత్మకం గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

ప్రతి ఓటూ కీలకమే..

2019 పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో చెల్లని ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, ఈ సారి అభ్యర్థులు ప్రతి ఓటు చెల్లేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో 13,509 ఓట్లు చెల్లలేదు. 2,48,799 ఓట్లు ఉండగా 1,49,319 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 60 శాతం ఓట్లు మాత్రమే పోలు కావడంతో ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. చెల్లని ఓట్ల సంఖ్య తగ్గించే దిశగా కూడా అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటు వేసే విధానంపై కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ముఖ్య నేతలకు లోకేష్ ఫోన్

యువనేత నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి అసెంబ్లీ స్థానం కూడా ఈ ఎన్నికల పరిధిలో ఉండటంతో ఆయన కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్య నేతలకు ఆయన నేరుగా ఫోన్ చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమించాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా రాజా గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వీరితో పాటు ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ తదితరులను కూడా యువనేత లోకేశ్ రంగంలోకి దించి ప్రచారం నిర్వహింప చేస్తున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని జనసేన, బీజేపీ నేతలు కూడా ఇప్పటికే తమ నియోజకవర్గాల్లో పలు మార్లు సమావేశాలు నిర్వహించి రాజాను గెలిపించాల్సిందిగా కోరటం జరిగింది.

కొత్తగా చేరిన లక్ష ఓట్లు

2019తో పోలిస్తే ఈ సంవత్సరం లక్ష ఓట్లు కొత్తగా చేరాయి. 2019లో 2,48,799 ఓట్లు ఉండగా, ఈ సంవత్సరం 3,47,116 ఓట్లు నమోదయ్యాయి. 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఓట్లు 25 ఉన్నాయి. కూటమి వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి పట్టభద్రుల ఓట్లు చేర్చుకొనేందుకు సహకరించింది. దీంతో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉత్సాహం ఉన్నవారే ఓటు నమోదు చేసుకునేవారు. ఈ సారి నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాల కూడా ఓటర్ల సంఖ్య పెరగడానికి కారణమయింది. మొత్తం మీద పెరిగిన ఓట్లు ఏ అభ్యర్థికి అనుకూలంగా మారతాయో చూడాలి.

ప్రచారంలో బిజీగా నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇన్‌చార్జిని నియమిం చడంతో పాటు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక బాధ్యుడుని ఏర్పాటు చేసి ఓటర్లను కలిసే కార్యక్ర మం చేపట్టింది. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరుని కూటమి శ్రేణులు కలసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియో జక వర్గానికి ఒక ఎన్నికల పరిశీలకుడిని కూటమి నియమించింది. వీరు ఎప్పటికప్పుడు ప్రచార సరళిని సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే పరిశీలకులు సరిదిద్దుతున్నారు. ఒక్కొక్క ఓటరును రెండు సార్లు అయినా కలసి సానుకూల ఓటింగ్ జరిగేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తు న్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి కూడా ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిపై సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలపాటిని గెలిపించాలని స్వయంగా వారు పట్టభద్రులను కలసి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాలను కలసి జగన్ పాలనలో ఉద్యోగ వర్గాలకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమా లను వివరిస్తున్నారు. కూటమి, పీడీఎఫ్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఆలపాటి రాజా.. లక్ష్మణరావు మధ్య పోటీ రసవత్తరంగా మారింది.

రోస్టర్‌లో.. తప్పులు నిరుద్యోగులకు తిప్పలు

- రోస్టర్ ప్రకటనలో లోపాలపై అభ్యర్థుల్లో కలవరం

ఈ నెల 23వ తేదీన ప్రారంభం కానున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు, గ్రూప్-2 అభ్యర్థులు వేడుకొంటున్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్- 2 నోటిఫికేషన్ లోపభూయిష్టంగా ఉందని, నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరిగితే మెరిట్ అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతారని వారు ఆందోళన చెందుతున్నారు. రోస్టర్ సరిచేసేంత వరకూ మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ రెండు రోజులుగా గుంటూరులో ఆందోళనలు చేస్తున్నారు. సరిగ్గా మెయిన్స్ పరీక్షకు ఒక్కరోజు ముందు, శుక్రవారం ఉదయం గుంటూరు కలెక్ట రేట్ ఎదుట వందల మంది అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం పట్టించుకోవాలంటూ రోడ్డెక్కిన అభ్యర్థులు



గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రూపు- 2 అభ్యర్థులు

- ఎన్నికలకు ముందు హడావుడిగా గత ప్రభుత్వం నోటిఫికేషన్
- గత ప్రభుత్వం తెచ్చిన జీవో. నెం. 77తో మరింత గందరగోళం
- సరిచేయాలని కొంతకాలంగా నిరుద్యోగుల అభ్యర్థన
- రెండు రోజుల్లో మెయిన్స్.. వాయిదా కోరుతూ ఆందోళన
- గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసనలు

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పిన గత ముఖ్యమంత్రి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఎన్నికలకు ముందు నిరుద్యోగులను బుజ్జగించడానికి, వారి ఓట్లు పొందడానికి అన్నట్లుగా ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ చూసుకున్న నిరుద్యోగులు ఆందోళ నకు గురయ్యారు. నోటిఫికేషన్లో ప్రకటించిన రోస్టర్ పాయింట్లు తప్పుల తడకగా ఉన్నట్లు గుర్తించి, వాటిని సరిచేయాలని ఆందోళన చేపట్టారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్సీలు కూడా రోస్టర్ తప్పులను ప్రభు త్వానికి ఎత్తి చూపారు. అయిన ప్పటికీ యథావిధిగా గ్రూప్- 2 ప్రిలిమ్స్ పరీక్షలు జరిగిపోయాయి. ఆ తరువాత ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ బోర్డులో మార్పులు జరిగాయి. దీంతో గ్రూప్- 2 నోటిఫికేషన్లో దొర్లిన తప్పులను ఏపీపీఎస్సీ సరిచేస్తుందని భావించారు. కానీ ఆ దిశగా ఏమీ జరగలేదు. దీంతో ఆందోళన చెందిన పలువురు గ్రూప్- 2 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారిస్తున్న హైకోర్టు రోస్టరుపై నిర్దిష్టమైన తీర్పు ఏదీ ఇవ్వలేదు. కానీ పరీక్షల నిర్వహణను యథావిధిగా ఈనెల 23 నుంచి కొనసాగించుకోవచ్చని సూచిం చింది. అప్పటి వరకూ కోర్టుపైనే ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు కోర్టు తీర్పుతో తీవ్ర కలవరానికి గురయ్యారు. ఆందోళనబాట పట్టారు.

● వైసీపీ నిర్వాకంతో.. నిరుద్యోగుల్లో నిస్పృహ

గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి, ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా క్యాలెండర్ విడుదల చేయ లేదు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా 2023 డి సెంబరు 7న గ్రూప్- 2 నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో కూడా నామమాత్రంగా 905 పోస్టులు మాత్రమే ఉన్నాయి. అందులో కీల కమైన గెజిటెడ్ పోస్టులు మున్సిపల్ కమిషనర్ 4, సబ్ రిజిస్ట్రార్ 16, లేబర్ ఆఫీ సర్ 28, పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ 2, కోఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 16 పోస్టులు ఉండగా, డిప్యూటీ తహసీల్దార్ 114, ఎక్సైజ్ ఎస్సై 150 మాత్రమే ఉన్నాయి. డీటీ, ఎక్సైజ్ ఎస్సై పోస్టులు మినహా మిగిలిన అన్ని పోస్టుల్లో జనరల్ కేటగిరీకి, మహిళా కోటాకు సమానంగా పోస్టులు వస్తున్నాయి. ఐదేళ్ల తరువాత వచ్చిన నోటిఫికేషన్లో నామమాత్రంగానే పోస్టులు ఉండడం, అందులోనూ రిజర్వేషన్ లేకుండా పోవడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో వెలువడే నోటిఫికేషన్లలో కూడా తమకు మేలు జరగదన్నా నిస్పృహ వారిని వెంటాడుతోంది.

● గత ప్రభుత్వం తెచ్చిన జీవోతో తంటా..

గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై 2023 ఆగస్టులో జీవో. ఎంఎస్. నెం.77ను జారీ చేసింది. రిజర్వేషన్లలో భాగంగా మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు సంబంధించి వర్టికల్ రిజర్వేషన్‌ను అందులో ప్రకటించింది. జీవో ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్లూఎస్ రిజర్వేషన్ అభ్యర్థుల ఎం పికలో మహిళలకు కేటాయించిన 33.33 శాతం వర్టికల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తారు. అంటే ఆయా కేటగిరీలు, సబ్ కేటగిరీల్లో ఎంపిక చేసే అభ్యర్థుల్లో మూడో వంతు మహిళలకు కేటాయి స్తారు. ఇది గతం నుంచి అమలులో ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకమైన జీవో తెచ్చింది. ఆ జీవోలో రోస్టర్ పాయింట్లను ప్రకటించింది. గతంలో అమలులో ఉన్న జీవో ప్రకారం వంద పాయింట్ల రోస్టర్ విధానంలో హారిజాంటల్ రిజర్వే షన్లో భాగంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పోస్టులు కేటాయిస్తారు. అందులోనే వర్టికల్ రిజర్వేషన్ కోటా కింద 1/3 వంతు మహిళల కోటా పోస్టులు కూడా ప్రకటిస్తారు. ఆ వంద పాయింట్ల రోస్టర్ లోనే జనరల్ ఎన్ని, మహిళలు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్ అభ్య ర్థులకు ఎన్ని అనేది స్పష్టంగా ఉంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పోస్టుల ఎదుట హారిజాంటల్ కేటగిరీ పోస్టులను ప్రకటించలేదు. దీం తో వర్టికల్ రిజర్వేషన్‌పై గ్రూప్-2 నోటిఫికేషన్లో గందర గోళం నెలకొంది.

● ఆందోళనకు కారణం..

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గ్రూప్- 2 నోటిఫికేషన్లో ఉన్న మొత్తం పోస్టుల్లో 45 శాతం పోస్టులు మహిళలకే కేటాయించి ఉన్నాయని అభ్యర్థులు

(మిగతా 6వ పేజీలో)

వారబందీ అమలు చేయండి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సరఫరాలో వారబందీ విధానాన్ని అమలు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. నీటి వినియోగంపై నియంత్రణ ఏదీ..? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై స్పందిచిన ఆయన శుక్రవారం ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన వన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రెండు రిజర్వాయర్లు నాగార్జున సాగర్.. పులిచింతలలో నీటి కొరత ఉందని , దీని కారణంగా సాగుకు నీటి సరఫరాలో వార బందీ ప్రక్రియను అమలు చేయాలన్నారు. సాగు నీటి వినియోగం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి విడుదల్లో తాగు నీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని చెరువులలో పూర్తి స్థాయి నీటి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా తాగు నీటి సఫరా చేయాలని ఆదేశించారు. నీరు వృధా, చెరువులలో నీరు లీకేజీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు ఎంత నీరు అవసరం ఉందో సదరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీ, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఈఈ లు మురళీ కృష్ణ, శ్రీహరి, ప్రేమ్ కుమార్, మురళీ, ఉద్యాన వన శాఖ అధికారి రామణా రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.


జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములవ్వాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో ఉద్యాన, వ్యవసాయ అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో అరుణ్‌బాబు మాట్లాడుతూ రైతులు పంటలకు రసాయనిక పురుగు మందులు అధికంగా వాడటం వలన పెట్టుబడి పెరిగి, ఆదాయం తగ్గటంతో భూమి భూసారం కోల్పోయి, పంటల దిగుబడి తగ్గుతుందని, ప్రకృతి పర్యావరణానికి హాని కలిగి పండించిన పంటలలో పురుగుమందుల అవశేషాలు ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు పత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన పంటకు ముందుగా వేసవిలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ 30 రకాల విత్తనాలను రైతులందరూ వేసుకునేలా అన్ని శాఖల అధికారులు ప్రోత్సహించాలన్నారు. వెలుగు శాఖ జిల్లా సమాఖ్య మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సంఘ సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఎజెండాగా చేర్పించి చర్చించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉన్న పీఎండీఎస్ విత్తనాలు వేసుకోవడం ఘన, ద్రవ జీవామృతం వాడటం పురుగుమందులకు బదులు వృక్ష సంబంధిత కషాయాలు వంటివి వాడుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, వాటి విస్తీర్ణం పెరిగేలా చర్యలు చేపడతారన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వివిధ రకాల ఏ గ్రేడ్ మోడల్స్, ఏటీఎం నిరంతర ఆదాయాన్నిచ్చే మోడల్స్ వర్షాభావ పరిస్థితులను తట్టుకునే డౌట్ ప్రూఫ్ మోడల్స్, వేసుకోవడం వల్ల రైతులకు లాభాదాయకమన్నారు. అదేవిధంగా నిరుపేదలైన పీవోపీ సభ్యులందరూ కిచెన్ గార్డెన్లో, 365రోజులు ఉండేలా చూడాలని అన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద టెర్రస్ గార్డెనింగ్, పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. పీఎండీఎస్ విత్తనాలు వేసి పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తున్న పెదకూరపాడు రైతు దర్శి శేషారావును, నకరికల్లు రైతు రుసుం సాంబశివరావును సన్మానించారు. కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ సందర్శించారు. ప్రతి సోమ వారం అన్ని మండలాల్లోకూడా స్టాల్స్ ఏర్పాటు చేయటం శుభ పరిణామం అన్నారు.


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

గుడ్డుకాయ స్వాహా





బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం గ్రేటర్ గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు.

8

అంబేడ్కర్ ప్రపంచ మేధావి



ప్రసంగిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి దశా, దిశా చూపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా కీర్తి పొందారని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో, పొలిటికల్, ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రోగ్రెసివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. ముఖ్యఅతిథి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం చాలా గొప్పదన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, సెమినార్ డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్, సెమినార్ కోశాధికారి డాక్టర్ కె.అబ్రహం లింకన్, అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్, గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ కె.సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి, నూటా అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఆర్ఐవో జుబేర్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, విద్యాశక్తి ద్వారా ఐఐటీ మద్రాసు సౌజన్యంతో జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ జి.సునీత మాట్లాడుతూ ఏటా తమ కళాశాల విద్యార్థులు 90శాతంపైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైన్స్ ఆర్ట్స్ గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు మెమెంటోలు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



ఉప్పలపాడులో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ, పార్టీ నాయకులు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా పాటుపడాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో మండల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఆశీస్సులతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేలా శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర నేతృత్వంలో సమష్టిగా పాటుపడాలన్నారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారనీ, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు జోక్యంతో 25 శాతం ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసేందుకు, 75 శాతం మేర కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. నాడు జగన్ చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారాయని, పోలవరంలో జగన్ చేసిన తప్పిదాలను చంద్రబాబు నాయుడు సరిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో ప్రచారం

ఉపాధ్యాయులు గత వైసీపీ హయాంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిపై యాప్‌ల భారం విపరీతంగా ఉందని, ఇక ఆ యాప్‌ల భారం తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు వివరించారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు పట్టభద్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందజేశామని, డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఇది కోరి తెచ్చుకున్న కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు.

రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి



జాతీయ సదస్సు సావనీరును ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, వీసీ గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి కావాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం "సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధికి అవలంబించాల్సిన సుస్థిర విధానాలు" అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ మానవ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలన్నారు. వస్తువుల పునర్ వినియోగం అనేది భారత జీవన విధానంగా ఉండేదనీ, తిరిగి దానిని మళ్లీ కొనసాగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రీసైక్లింగ్ అంశంపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ పురుగుమందుల వాడకాన్ని తగ్గించడంతోపాటు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ పర్యావరణ విభాగం డీన్ డాక్టర్ కె.రాజేంద్రన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు అనుసరిస్తున్న పద్ధతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఏఎన్యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జాతీయ సదస్సు సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 40 మంది పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు సదస్సుకు హాజరై తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. అనంతరం సదస్సు సావనీరును ఆవిష్కరించటంతో పాటు కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. సైన్స్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఏవీవీఎస్ స్వామి, పర్యావరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ కె.శశిధర్, భారతి దాసన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకటాచలం, మహారాష్ట్ర పెర్గో సన్ కళాశాల అధ్యాపకులు తన్వి యోగేష్ భరద్వాజ్, అమీర్ ముల్లా, ఆశిష్, మానవ వనరుల అభివృద్ధి విభాగ అధ్యాపకులు ఆచార్య తులసీదాస్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోస్టర్‌లో తప్పులు... నిరుద్యోగులకు తిప్పలు

(5వ పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వర్టికల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం పోస్టుల్లో 1/3వంతు పోస్టులు మాత్రమే మహిళలకు వెళ్లాలి. కానీ కొన్ని కేటగిరీల్లో సగానికి సగం మహిళలకు వెళుతున్నాయని, కొన్ని కేటగిరీల్లో మహిళలకు రావాల్సిన 1/3వ వంతు కూడా రావడంలేదని అభ్యర్థులు అంటున్నారు. నోటిఫికేషన్లో మొత్తం 905 పోస్టులు ఉండగా అందులో 140 పోస్టుల వరకూ రోస్టర్ గందరగోళం ఉన్నట్లు చెబుతున్నారు. జనరల్ కోటాలో 408 పోస్టులుండగా మహిళలకు రమారమి 112 పోస్టులు రావాల్సి ఉండగా, వారికి అదనంగా 25 పోస్టులు కలిసి 137 పోస్టులు వచ్చాయని, అవి జనరల్ అభ్యర్థులు నష్టపోయారని, ఎస్సీ కేటగిరీలో మహిళలకు 25 పోస్టులు రావాల్సి ఉండగా వారికి 7 పోస్టులు తగ్గి 18 పోస్టులు, ఈ డబ్ల్యూఎస్ కోటాలో 20 పోస్టులు మహిళలకు రావాల్సి ఉండగా, వారికి 5 పోస్టులు తగ్గి 15 పోస్టులు మాత్రమ వచ్చాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేటగిరీల్లో రెండు పోస్టులే ఉన్నాయి. అలాంటి చోట్ల ఒకటి జనరల్, ఒకటి మహిళలకు కేటాయించారు. అలాంటి ప్రత్యేక సందర్భంలో జనరల్ అభ్యర్థులు భారీగా పోస్టులు కోల్పోయారు. ప్రభుత్వం ప్రకటించిన రోస్టర్ విధానంతో నిరుద్యోగుల తలరాతలు మారిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ నిర్వాకంతో ఐదేళ్లపాటు నోటిఫికేషన్లు లేక అల్లాడిపోయిన తమకు తాజా నోటిఫికేషన్ ప్రకారం రోస్టర్ అమలు జరిగితే ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం రోస్టర్ తప్పులను సరిచేసిన తరువాతే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని వేడుకుంటున్నారు. కాగా ఈనెల 11వ తేదీన ఈ అంశంపై హైకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకైనా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లు అరెస్టు

● రూ.1.9 లక్షలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
● ఎస్పీ తుషార్ డూడి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాలను ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్లకు వివరించారు. వాట్సాప్‌లో ముఖ్యమంత్రి ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా (డీపీ) ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న వారి గుట్టు రట్టు చేసినట్లు చెప్పారు. నేపాల్‌కు చెందిన ఆచారి రంజిత్ సింగ్ ప్రస్తుతం నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో స్థిరపడ్డాడు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన ఆవుల మండ వెంకటనారాయణ, వెస్ట్‌ఢిల్లీ మహాత్మాగాంధీ క్యాంప్ పంజాబిబాగ్‌కు చెందిన జతిన్ వురఫ్ సాహిల్‌లు కలిసి గతేడాది డిసెంబరు నెలలో జిల్లాలోని చీరాల ఆనందపేటకు చెందిన వారికి ఫోన్ చేసి ఆరోగ్యప్రతినిధిగా నటించి ముఖ్యమంత్రి జననీ సురక్ష పథకం కింద రూ. 70 లక్షలు కేటాయించారని నమ్మించారు. మాయమాటలతో ప్రలోభపెట్టి ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేయమని ఒపించారు. ఈ విధంగా ముగ్గురు బాధితుల నుంచి రూ. 1,64,724 బదిలీ చేయించుకున్నారు. దీనిపై చీరాల టుటౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఐటీకోర్ ఎస్సై షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారం మేరకు టుటౌన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగభూషణం నేతృత్వంలో ఒక బృందం ఢిల్లీకి వెళ్లి, అక్కడ జతిన్‌ను పట్టుకొని ఫోన్ సీజ్ చేసి కేసుతో సంబంధం ఉన్న మిగిలిన అనుమానితుల వివరాలు సేకరించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి లక్షా 90 వేల రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, 15 సిమ్ కార్డులు, నాలుగు బ్యాంక్ పాస్‌బుక్‌లు, రెండు ఏటీఎం కార్డులు సీజ్ చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 96 సిమ్ కార్డులు ఉపయోగించి 132 మందిని మోసగించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో రూ. 66 లక్షల వరకు మోసగించినట్లు వివరించారు. 20 రాష్ట్రాలలో, 4 కేంద్రపాలిత ప్రాంతాలలో వీరిపై మొత్తం 213 కేసులు నమోదైనట్లు తెలిసిందనీ, సుమారు రూ. 4 కోట్లు మోసం చేశారని తెలిపారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న చీరాల టుటౌన్ సీఐ బి.నాగభూషణం ఆర్ఐటీ శ్రీకాంత్, ఐటీ కోర్ టెక్నికల్ టీమ్ ఎస్సై షేక్.నాయుబ్ రసూల్, ఎస్సై నాగశ్రీను, టెక్నికల్ టీమ్, కానిస్టేబుళ్లు బి.సురేష్, కె.రాము, ఐ.కీర్తి, డి.తబితలను ఎస్పీ అభినందించారు.చీరాల డీఎస్పీ మోయిన్, సీఐ బి.నాగభూషణం, ఆర్ఐ టి.శ్రీకాంత్, ఎస్సై షేక్.నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

జవాన్ వెంకటేశ్‌కు ఘన నివాళి



పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలోని గౌడపాలెం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పరిశా మోహన వెంకటేశ్ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. తొలుత వెంకటేశ్ గృహానికి బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, కెప్టెన్ సత్యప్రసాద్, ఏడీ డైరెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, పర్యవేక్షణాధికారి డి.ఆనందరావు, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ వేర్వేరుగా వెంకటేశ్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భౌతిక కాయాన్ని స్వగ్రామం నుంచి శ్మశాన వాటిక వరకు అధికారిక లాంచనాలతో తీసుకెళ్లారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సైనికులు మూడు రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపారు. గ్రామ సర్పంచి బొలగాని అరుణకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన, టీడీపీ నాయకులు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పట్టభద్రులను మోసగిస్తున్న పీడీఎఫ్

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ముసుగులో వైసీపీకి తొత్తుగా మారి పట్టభద్రులను మోసగిస్తున్న కేఎస్ లక్ష్మణరావును విద్యావంతులు ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బాత్రూమ్‌లు, మద్యం దుకాణాల వద్ద కాపాలా పెట్టి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ పాలకులు దెబ్బతీస్తుంటే అప్పుడు కేఎస్ లక్ష్మణరావు ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా కేఎస్ లక్ష్మణరావు శాసనమండలిలో ఏనాడైనా చర్చించారా అని ప్రశ్నించారు. విద్యావంతులు వీటిపై ఆలోచించాలని సూచించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందనీ, కూటమి అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు అన్నారు. అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ ఫలాలు సామాన్య ప్రజానీకానికి అందాలన్నా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శాసన మండలిలో ఆలపాటి అడుగు పెడితే విద్యావంతుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.

మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంఎస్ చౌదరి

తాడేపల్లి (ప్రాతూరు కట్ట), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఉపయోగపడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, విజయవాడ క్లబ్ జాయింట్ సెక్రటరీ గుత్తికొండ వెంకట శైలేష్ కుమార్, క్లబ్ సభ్యులు, ప్రతినిధులు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు నిర్వహించారు.

కుంభమేళాకు 60 వేల మంది యాత్రికులు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు ప్రత్యేక రైళ్ల ద్వారా గుంటూరు, విజయవాడల నుంచి 60 వేల మంది యాత్రికులు ఇప్పటి వరకు ప్రయాణించారని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రైల్వేస్టేషన్ల మీదుగా ఇప్పటి వరకు 115 రైళ్లను రైల్వే శాఖ నడిపిందన్నారు. ఈ రైళ్లన్నీ 100 శాతం పైగా ఆక్యుపెన్సీతో ప్రయాణించాయని పేర్కొన్నారు. ఈ రైళ్లు ప్రయాగ్‌రాజ్ చియోకి, గయా, అజాంగడ్, బనారస్, దానాపూర్‌లకు ప్రయాణం చేశాయని చెప్పారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, నరసపూర్ రైల్వేస్టేషన్ల నుంచి ఈ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం నడిపామన్నారు. ఆయా రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు సులభతరంగా రైళ్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ అయ్యేందుకు రోప్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. అదనపు షెల్టర్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈ నెల 23న చర్లపల్లి నుంచి దానాపూర్‌కు ఒక ప్రత్యేక రైలు, దానాపూర్ నుంచి చర్లపల్లికి మరో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 534.60 అడుగులు ఉంది. ఇది 177.26 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8452 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,477, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 33,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

పల్నాడు వార్తలు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్ర వారం 30.63 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దిగువకృష్ణకు నీటి విడుదల నిలిపివేసినట్లు తెలిపారు.

వ్యర్థాల తొలగింపు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వావిలాల పార్కులో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ షమ్మి పర్యటించారు. పార్కులో ఉన్న పిచ్చి చెట్లు, వ్యర్థాలను పురపాలక సంఘ సిబ్బంది చేత తొలగింప చేశారు. వ్యర్థాలు వేయకుండా చూడాలని వాచ్‌మెన్, ఇతర సిబ్బందికి ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు పార్కును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాల లో శనివారం ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డి తెలిపారు. ఎముకలు విరిగినా, అరిగినా, మోకాళ్ల నొప్పులు, మోకాళ్ల ఆపరేషన్లు , పల్స్, బీపీ, షుగర్ పలురకాల ఎక్స్‌రేలు, రక్తపరీక్షలు, గైనకాలజీ, పిడియాట్రిక్స్ జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ సంబంధించి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సునీతారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురవారెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

పెదకూరపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ కొండ పల్లి వెంకటేశ్వరరావు అన్నారు. పెదకూర పాడులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో షైచాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ ఎస్‌కే బాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని లగడపాడులోనూ సురక్షిత గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

24 నుంచి ఆధార్ కేంద్రాలు

మాచవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24వ తేదీ నుంచి మండలంలోని పలు గ్రామాల సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని ఎంపీడీవో వెంగళరావు శుక్రవారం తెలిపారు. ఈ ఆధార్ కేంద్రాల్లో ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు కొత్త ఆధార్ కార్డులు నమోదు, గతంలో తీసుకున్న వారికి చేర్పులు, మార్పులు చేయటం జరుగుతుందన్నారు. పిన్నెల్లి, మాచవరం, మోర్జంపాడు గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటార న్నారు. ఈ అవకాశాని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలకు ఆటలపోటీలు

క్రోసూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్లో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు ఆటల పోటీలు నిర్వ హించారు. రెండు శిక్షణా కేంద్రాల్లో మొత్తం 80 మంది అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ కే ఖాజావలి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వివిధ రకాల ఆటల పోటీల్లో అంగన్‌వాడీ టీచర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో - 2 గణేష్, డీఆర్‌పీలు వణుకూరి మాధవి, బాలా త్రిపుర సుందరి, పోతయ్య, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో శుక్రవారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సుమారు 50 సంవత్సరాలు గల ఓ వ్యక్తి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఆదివారం విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు అదే రోజు అతడ్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులెవరూ రాక పోవడంతో శుక్రవారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు కార్యక్రమంలో భవనాసి నాసరయ్య, శివసుందర్‌ప్రసాద్, శివ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూళ్లల్లో అలసత్వం

- పేరుకుపోయిన బకాయిలు
- 37 రోజుల్లో వంద శాతం వసూలయ్యేనా?

సత్తెనపల్లి పురపాలక సంఘంలో పన్ను వసూళ్లల్లో అలసత్వం కారణంగా కోట్లల్లో బకాయిలు పేరుకు పోయాయి. ఇంటి, నీటి పన్ను వసూలు చేయాల్సిన సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పన్ను బకాయిలు పేరుకు పోయాయి. మరో 37 రోజుల వ్యవధిలో ఈ ఆర్థిక ఏడాది ముగుస్తుంది. ఈ లోపు వంద శాతం వసూళ్ళు సాధ్యమయ్యేనా?

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో ప్రజల సమస్యలు తీర్చా లంటే నిధులు ముఖ్యం. పారిశుధ్య పనులు చేపట్టే కార్మికులకు జీతాలు, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలంటే వాహనాలకు డీజిల్ ఖర్చు ఉంటుంది. వీధిదీపాల నిర్వాహణతో పాటు వాటి మరమ్మతులకు ఖర్చులవుతాయి. రోడ్లు, కాలువల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు లేనిదే అభివృద్ధి సాధ్యం కాదు. పురపాలక సంఘానికి ఇంటి, నీటి ప్రకటనల పన్నులతో బిల్డింగ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, మార్కెట్ లీజు, మునిసిపల్ వాణిజ్య గదుల అద్దెలు వంటి వాటితో వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులతో పాటు మునిసిపాలిటీలో ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించాల్సి ఉంటుంది.

పేరుకు పోయిన బకాయిలు

పురపాలక సంఘంలో 16,096 ఎస్‌ఎస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.6,86,49,000 కోట్లు ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉండగా నేటికి రూ 3,44,81,000 మాత్రమే వసూలయ్యాయి. ఇంకా వసూలు చేయాల్సింది రూ 3,41,68,000 ఉంది. నీటి పన్ను రూ.2.47 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.42.50 లక్షలు వసూలైంది. ఖాళీ స్థలాల పన్ను రూ.45 లక్షలకు గాను రూ.14.32 లక్షల వసూలైంది.



సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయం

220 మందికి రెడ్ నోటీసులు

పురపాలక సంఘంలో ఇంటి పన్ను బకాయిలు ఉన్న వారిలో అధిక సంఖ్యలో బకాయిలు ఉన్న 220 మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోపు నోటీసులకు స్పందించక పోతే వారి ఆస్తులు సీజ్ చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటి పన్ను బకాయిల్లో మొదటి వంద మంది జాబితాను సిద్ధం చేసి నోటీలు ఇచ్చారు. నోటీసులకు స్పందించకుంటే వారి ఆస్తులను సీజ్‌చేస్తామని అధికారులు చెపుతున్నారు. 126 మంది మొండి బకాయి దారులకు లీగల్ నోటీసులు కూడా జారీ చేశారు.

పన్ను వసూలు కోసం స్పెషల్ డ్రైవ్



పురపాలక సంఘంలో ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులతోపాటు వాణిజ్య, గదుల అద్దె వసూళ్ళ కోసం సచివాలయ సిబ్బందితో పాటు మునిసిపల్ అధికారులు, సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు వసూళ్ళకు టార్గెట్ ఇచ్చాం. మొండి బకాయి దారులకు రెడ్ నోటీసులు, లీగల్ నోటీసులు సైతం జారీ చేశారు. త్వరలో ఆస్తులు జప్తు చేసే చర్యలు చేపడతాం. నీటి పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ తొలగిస్తాం.

- మునిసిపల్ కమిషనర్ షమ్మి


రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

ఉపాధ్యాయులను శత్రువులుగా చూసిన వైసీపీ

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని అభ్యర్థన

రాజుపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉపాధ్యాయులను శత్రువులుగా చూసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. శుక్ర వారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయం, జడ్పీ హైస్కూల్, అనుపాలెం గ్రామంలోని జడ్పీ హైస్కూలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి, తాతా జయప్రకాష్ నారాయణ, సాగి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య, పూజల వెంకటకోటయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, వెంకట్రామిరెడ్డి ఉన్నారు.


విజయపురిసౌత్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి : ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, శేరెడ్డి గోపిరెడ్డి, బొల్లా వెంకటేశ్వర్లుచౌదరి, వజ్రం నాయక్, గుండాల శ్రీను, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, బసివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా కూటమి నేతలు మండలలోని కొత్తపుల్లారెడ్డిగూడెం, కండ్లకుంట, గుండ్లపాడు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓటుని అభ్యర్థిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, మధుసూదన్‌యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీలోని తహసీల్దార్, పోలీసుస్టేషన్, ఎంపీడీవో, శ్రీశక్తిభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను కూటమి నేతలు కలసి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును ప్రాధాన్య ఒకటి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, అక్కినపల్లి బాలయ్య, తిరుమలకుమార్, సొసైటీ నారాయణ, పగడాల భాస్కరరావు, కూరాకుల నాగేశ్వరరావు, అచ్చారావు, బొమ్మిరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను కూటమినేతలు కలుసుకొని కూటమిఅభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచార పత్రాలను అందజేసి ఓటు వేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ నేతలు దుద్దుల యోహాన్, ఊరే రోశయ్య, షేక్ హసాన్, నలజాల కోటేశ్వరరావు, మన్నెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూ రీసర్వే చేపట్టాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు
- నార్నెపాడు గ్రామంలో సర్వే పనుల పరిశీలన


భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ముప్పాళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని కలెక్టర్ పి. అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే పక్కాగా జరగాలని, భూ సంబంధిత సమస్యలపై రైతులు అధికారుల వద్దకు రాకుండా ఉండేలా రీ సర్వేను పకడ్బందీగా, ఖచ్చితత్వంతో చేపట్టాలన్నారు. సర్వే చేసేటప్పుడు సంబంధింత భూ యాజమానితో పాటు చుట్టు ప్రక్కల రైతులు కూడా ఉండేలా చూడాలన్నారు. భూ రీసర్వే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు వెలుబుచ్చిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు. ముందుగా సంబంధింత భూ రికార్డులను కలెక్టర్ పరిశీలించి, సర్వే నెంబర్లు ఆధారంగా రైతువారి భూ విస్తీర్ణంపై అధికారులను ఆరా తీశారు. గ్రామంలోని భూముల వివరాలను సమగ్రంగా అందజేయాలని, వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీ సర్వే ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు సూచించారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే పనిని పరిశీలించి ఆర్డీవో, తహసీల్దార్ ద్వారా వివరాలు సేకరించారు. కలెక్టరుతో పాటు ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ భావాని శంకర్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- మునిసిపల్ కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణాల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. మార్చి చివరి నాటికి మొత్తం గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్రరావు, హౌసింగ్ ఏఈ బంగారయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కంభాల అనీల్ కుమార్, బీఎల్ చిన్నయ్య, కల్లం వీర భాస్కరరెడ్డి, పల్లా వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాస రావు, జొన్నలగడ్డ విజయకుమార్, హరిబాబు, బాబూరావు,నరసింహారావు, సాంబశివరావు, నాగరాజు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు

సత్తెనపల్లిరూరల్, జనవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపూడి గ్రామంలో ఉన్న అచ్చమాంబ తల్లి ఆలయంలో శుక్రవారం గుండ్లపల్లికి చెందిన శ్రీ కామాక్షి ఐకేఆర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు వాసుదేవరావు, బాపూజీలు 150మందికి కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలను చేసి, ఉచితంగా మందులను అందజేశారు. కళ్ళజోళ్ళు, కంటి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి, వారికి రాయితీపై కళ్ళజోళ్ళు అందజేసి, ఆపరేషన్‌లు చేయనున్నట్టు వైద్యులు తెలిపారు. శిబిరంలో టీడీపీ నేతలు కొనకంచి పుల్లారావు, గజానన, అప్పారావు, పుల్లారావు, సాంబశివరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపు అంకమ్మ తల్లి తిరునాళ్ల

రాజుపాలెం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలో ఉన్న అంకమ్మతల్లి ఆలయ 56వ వార్షిక తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరునాళ్లకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు కన్నాలక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లు హాజరు కానున్నారని వారు తెలిపారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ కోసం ఉద్యమిస్తాం

- అఖిలపక్ష సమావేశంలో వక్తలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన పల్నాడు ప్రాంత వాసులకు కలగా మిగిలిన వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఉద్యమిస్తామని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్ర వారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం వరికపూడిశెలకు నిధులు కేటాయించాలని, తక్షణమే పనులు ప్రారంభించేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణంతో లక్షలాది ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రాజెక్ట్ నిర్మాణంపై హామీలిచ్చే నేతలు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే ఎమ్మెల్యేలు తమ పదవులనుంచి వైదొలగాలన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల నుంచి పోస్టుకార్డ్ ఉద్యమాన్ని ప్రారంభించడానికి వెనుకాడేది లేదని, అవసరమైతే ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలకైనా వెనుకాడేది లేదని అన్నారు. త్వరలో పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి ముఖ్యమంత్రి కాపు కార్యాలయం వరకు వేలాది మంది రైతాంగంతో పాదయాత్ర చేసేందుకు అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ నేత మిద్దె పోగు బాబురావు, కాలా శివయ్య, రైతు సంఘం నేత తోట ఆంజనేయులు, బీఎస్పీ నేత గుండాల సైదులు, గురజాల అప్పారావు, అబ్రహం లింకన్, పీడీఎఫ్ నేత షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ నేత పుల్లారెడ్డి, వరికపూడిశెల సాదనసమితి సభ్యులు కుర్రి పున్నారెడ్డి, బండారు సుబ్బారావు, జై భారత్ జాతీయ పార్టీ సభ్యుడు నవులూరి శివారెడ్డి, ఏఐవైఎఫ్ నేత నర్రా రంగస్వామి, ఏఐటీయూసీ నేతలు ఎస్‌ఎండి బాషా, గాజుల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటుపరం చేయొద్దు

- బ్యాంకు ఉద్యోగుల నిరసన

మాచర్లటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేయవద్దని ఆఫీసర్స్ సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని రామాటాకీస్ లైన్ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో సిబ్బంది కొరతతో ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగిందన్నారు. వెంటనే ఉద్యోగుల నియామకాలను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అమరప్రసాద్, పున్నారావు, రాజశేఖర్, సునీల్, అజీజ్, సుబ్బారావు, రత్నశ్రీ, నాగలక్ష్మి, సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి సత్కారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మునిసిపల్ కమిసనర్‌గా పని చేస్తున్న కొలిమి షమ్మి గ్రేడు-2 కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొంది విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా వెళ్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో అన్నిశాఖల ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది షమ్మి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షమ్మీ మాట్లాడుతూ పురపాలకసంఘ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజల సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు కార్పొరేషన్ డీఈ మధు, సత్తెనపల్లి డీఈ వెంకటరమణ, ఏఈ సాగర్, మేనేజర్ నెట్టెం సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, టీపీవో, ఆర్‌వో,ఆర్‌ఐ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎంవీఐ శేషురెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి

దుర్గి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంవీఐ శేషురెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన దుర్గిలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలను నిలిపి డ్రైవర్లకు, ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని వాహనదారులకు సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆలపాటి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కూటమి పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో ఐదు రోజులు మాత్రమే ఉన్నాయని, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పెదకూరపాడు నియోజక వర్గంలోని ఆయా మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు వారి ఓటుని ఆలపాటికి వేసేలా చూడాలని, భారీ మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ప్రవీణ్ సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కేకే చౌదరి, ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు.


పనుల నిర్వాహణ వివరాల రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

- అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు..
- రూ. 1.92 లక్షల రికవరీకి ఆదేశాలు జారీ

క్రోసూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు క్రోసూరు మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన రూ 8 కోట్ల విలువైన ఉపాధి హామి పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాఅధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలకు ఆదేశించారు. వారి నుంచి రూ.1.92 లక్షలు రికవరీకి ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది కాలంలో మండలంలోని గ్రామాల్లో రూ.6 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, రూ.2 కోట్ల పంచాయతీ నిధులతో ఉపాధి హామీ పనులను నిర్వహించారు. మండలంలోని విప్పర్ల, నాగవరం, ఊటుకూరు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేదని అధికారులు గుర్తించారు. విప్పర్ల ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.83 వేలు, నాగవరం ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.92 వేలు రికవరీకి ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్‌లు ప్రజావేదికకు హాజరు కాకపోవటంపై డ్వామా పీడీ ఎం.సిద్ధ లింగమూర్తి అధికారులను ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అధికారులతోనే ప్రజావేదిక నిర్వహించినట్టు తెలిపారు. భవిష్యత్‌లో ఏ అవకతవకలు జరుగకుండా చిత్తశుద్ధి పనులు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆయన సూచించారు. ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ అధికారి కె.విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి జే ప్రభాకర్, ఎస్‌ఆర్‌పీ జేఎంఎస్ రాజు, ఏపీడీ కేవీ నారాయణ, ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


మాచర్లలో రచయితలను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కీర్తి పురస్కార గ్రహీత కవి, రచయిత చంద్రమౌళి రామనాథశర్మ, చరిత్ర పరిశోధకుడు, రచయిత పావులూరి సతీష్‌బాబులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ జోనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్య తెలుగులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకు రావాలన్నారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బచ్చు రాజ్‌కుమార్, సత్యనారాయణ

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలతో పాటు మంచి నడవడిక నేర్పేది మాతృ భాషేనని కన్నెగంటి హనుమంతు సేవా సంఘ అధ్యక్షుడు, విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రెంటచింతలలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత చదువుల తల్లి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాశ్చాత్య పోకడల వలన అమ్మభాషకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచికల్లు సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి 20మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో గోగుల వెంకట్రామిరెడ్డి, పల్లెర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాదుస్తులు ధరించిన విద్యార్థులతో పుల్లారెడ్డి

పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని 75తాళ్ళూరు, గారపాడు జడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచనపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాదు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో శాంతి మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు, స్వరూప్ భట్నాగర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి అభ్యుదయ రైతు

శేషారావుకి కలెక్టరు సత్కారం

పెదకూరపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో మిర్చి సాగు చేస్తున్న పెదకూరపాడుకు చెందిన ఉత్తమ అభ్యుదయ రైతు దర్శి శేషారావును శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఘనంగా సన్మానించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయంపై జరిగిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ అభ్యుదయ రైతు దర్శి శేషారావుని రైతులందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ కార్యాలయ బాధ్యులు రామాచంద్రరరావు, జిల్లా వ్యవసాయాధికారి మురళీ, సెరీ కల్చర్ అధికారి బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


శేషారావును సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

ఖరీఫ్ నాటికి... కడగండ్లు తీరేనా?

● మరమ్మతుల కోసం కృష్ణాడెల్టా కాల్వల ఎదురుచూపు

● ప్రత్యేక నిధుల మంజూరు చెయ్యాల్సిందే

ఏ కాల్వ కట్ట చూసినా కడ'గండ్ల'మయమే. కాల్వ అంచుల వెంటున్న గోడలు, షట్టర్‌లయితే సరేసరి. తుప్పుపట్టి రంధ్రాలు పడిపోయి, గోడలు పగుళ్లిచ్చి కూలిపోయిన దయనీయ పరిస్థితులే పశ్చిమ డెల్టాలో ఉన్నాయి. కట్టలకు గండ్లు పడకుండా ఉండాలన్నా, తూముల నుంచి నీరు లీకవకుండా షట్టర్‌ల స్థానంలో అడ్డు వెయ్యాలన్నా, అన్నిటికీ ఇసుక మూటలే దిక్కయ్యాయి. కొన్నిచోట్లయితే అవికూడా నిలవటానికి ఆధారం లేక కాల్వలోకి జారిపోయి నీటి ప్రవాహానికి అడ్డు పడిపోతున్న పరిస్థితి. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎటు చూసినా ఇవే కష్టాలు. దీనికి కారణం... గత ప్రభుత్వ కాలంలో ఐదేళ్లు కాల్వల మరమ్మతులకు విదిలింపుల మినహా, ప్రత్యేకంగా నిధులిచ్చిన పరిస్థితిలేదు. ఇచ్చిన ఆ కొద్దిపాటి నిధులుకూడా సీజన్ దగ్గరకొచ్చాక కాల్వలకు నీరొదిలే ముందు విడుదల చేశామనిపించి తూటుకాడ వంటివి తొలగించామని వాటినీ ఆ పార్టీ నేతలే జేబులో వేసేసుకున్న పరిస్థితి. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా కాల్వలో దిగి తూటుకాడ, గుర్రపుడెక్క వంటివి తొలగించుకుంటేకానీ సాగుకు నీరందని దారుణ పరిస్థితినే నిన్నటి వరకు అనుభవించారు.

తెనాలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ డెల్టా మొత్తం మూడు జిల్లాల్లో విస్తరించి ఉంటే, వాటిలో బాపట్ల, గుంటూరు జిల్లాల్లోనే అధిక విస్తీర్ణం సాగవుతోంది. ఈ డెల్టాలో మొత్తం 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, దానిలో గుంటూరు జిల్లా కింద 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు సాగవుతున్నాయి. మిగిలిన 7,164 ఎకరాలు మాత్రం ప్రకాశం జిల్లా పరిధిలో కొంతమేర ఉంది. గుంటూరు జిల్లాలో కొంత విస్తీర్ణానికి నీరు అందినా, బాపట్ల జిల్లాలోని చివరి భూములు, ప్రకాశం జిల్లాలో పూర్తి విస్తీర్ణానికి చుక్కనీరు అందటం గగనమై పోయింది. ఏ కాల్వ చూసినా కడ'గండ్లు'తప్ప పూర్తి సామర్థ్యంతో నీరు వెళ్లే పరిస్థితి లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రావటంతో మరమ్మతులపై దృష్టిపెట్టలేని పరిస్థితి. అయితే ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిచేసింది. సంఘాలు వచ్చిన తర్వాతే ఏ కాల్వకింద అత్యవసర పనులు ఏమున్నాయనేది గుర్తించగలిగారు. అయితే ప్రస్తుతం పనులు గుర్తించటం ఎంత ముఖ్యమో! వాటికి అవసరమైన నిదులు మంజూరు చేయటం, పనులు సకాలంలో పూర్తిచేసేలా అనుమతులివ్వటం కూడా అంతే ముఖ్యం. గతంలోలాగా సీజన్‌కు ముందు చివరి నిమిషంలో కాకుండా ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యేలా సత్వరం స్పందిస్తేనే 2025-26 ఖరీఫ్ సీజన్ సాగు నీటి కష్టాలు లేకుండా గట్టెక్కే పరిస్థితి.


పెదపూడి దగ్గర నిజాంపట్నం కాల్వకట్ట జారిపోయి కాల్వలో అడ్డుగా కనిపిస్తున్న చిత్రం

నీరున్నా సాగు సాగలేదు...

పశ్చిమ డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, ఈ మొత్తం విస్తీర్ణంలో ఒక ఖరీఫ్ సీజన్‌లో సాగు పూర్తవ్వాలంటే కనీసం 70 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే గడచిన నాలుగేళ్లలో నీరు సమృద్ధిగా ఉన్నా, వరి సాగుకు మాత్రం అందలేదు. దీనికి కారణం... కాల్వలు పూడిపోయి, కట్టలు కోతపడిపోయి ఉండటమే. ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి మెయిన్ కెనాల్‌కు ప్రతి రోజూ 7,500 నుంచి 9వేల క్యూసెక్కులకు పైగా నీటిని వదిలినా చేలకు మాత్రం ఆ నీరు చేరని పరిస్థితి. కాల్వల మొదటి భూముల్లోనే ఆ నీరంతా నిండిపోయి ముంపు ఏర్పడిన పరిస్థితులూ ఉన్నాయి. ప్రధానంగా కొమ్మమూరు, బ్యాంక్ కెనాల్ కాల్వల కింద సాగు విస్తీర్ణం భారీగా ఉంది. ఒక్క కొమ్మమూరు కాల్వ కిందే 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, బ్యాంక్ కెనాల్ కింద లక్ష ఎకరాలకుపైగా సాగులో ఉంది. అయితే వీటిపై గత డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలోనూ పనులు జరగలేదు. దీంతో ఈ కాల్వలపై కష్టాలు మాత్రం ఏటా పెరుగుతూనే వస్తున్నాయి. కొమ్మమూరు కాల్వ కింద అయితే కట్టలు గండ్లు పడటం, బాపట్ల, పొన్నూరు ప్రాంతాల్లో పొలాలు ముంపునకు గురవటం వంటి సమస్యలూ ఉన్నాయి. నీరులేక ఒక సమస్యయితే, నీరున్నా వీటి కింద కష్టాలు ప్రతికూలంగా ఎదురవుతుండటంతో ఏటా ఖరీఫ్ రైతు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి.

ప్రతిపాదనలు ఓకే.. సకాలంలో అనుమతులే కీలకం

గడచిన ఐదు ఖరీఫ్ సీజన్‌లలో పశ్చిమ డెల్టాలోని కాల్వలకు నీరు సమృద్ధిగా అందినా, పొలాలకు మాత్రం చేరలేదు. చివరి భూములకయితే పంట ఎండిన దారుణ పరిస్థితులుకూడా ఉన్నాయి. ఇంత దారుణంగా కాల్వలున్నా, నీరు చివరి భూములకు చేరకున్నా కనీసం మరమ్మతులు చేసిన దిక్కులేదు. గత ఐదేళ్లలో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెడితే, అవి ఆమోదం పొందటానికి, తర్వాత టెండర్‌లు పిలవటానికే పనుల కాలమంతా సరిపోయేది. తీరా పనులు మొదలుపెట్టే సమయానికి కాల్వలకు నీరు వదిలేయటంతో నీటిలోనే పనులు చేసినట్టు రాతరాసి ఆ నిధులను కాస్తా జేబుల్లో వేసేసుకునేవారు. అయితే ఈ సీజన్లో మాత్రం ఏకంగా 900కుపైగా పనులను గుర్తించారు. వీటి మరమ్మతులకు రూ. 40 నుంచి రూ. 50 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి పంపారు. ఇంత వరకు సకాలంలోనే ప్రతిపాదనల ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ ఖరీఫ్ సీజన్ ముగిసినా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి కోతలు పూర్తయిపోయి, రబీ కింద మొక్కజొన్న, జొన్నకూడా చాలావరకు చివరి దశకు వచ్చింది. అయితే ప్రకాశం జిల్లాకు ఇంకా మొదటి పంటకే నీరు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మార్చి నెలాఖరుకు అటు రబీ, ఇటు రెండవ పంటకింద మొక్కజొన్న వంటివి కూడా పూర్తయిపోతాయి. మళ్లీ ఖరీఫ్ సీజన్ జూలై నుంచి మొదలవుతుంది. అంటే ఇంకా మూడు నుంచి నాలుగు నెలల వరకు పనులు చేసుకునేందుకు గడువు ఉంటుంది.

అయితే ఇప్పటికే నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది కనుక వెంటనే వాటి అనుమతులు మంజూరు చేస్తే టెండర్ల ప్రక్రియ వంటివి ఏప్రిల్లోపే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అప్పటి నుంచి జూలై వరకు పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది కనుక కాంక్రీట్ పనుల వంటివాటినికూడా పక్కాగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. గతంలోలాగా తూటుకాడ తొలగించామని నిధులు జేబులో వేసుకునే పరిస్థితి ఉండదు. నీరు వదిలేలోపే పనులు పూర్తవుతాయి కనుక చెయ్యకుండానే చేశామని మాయచేసే అవకాశం కూడా ఉండదు. దీనికితోడు సాగునీటి సంఘాలు ఉండటంతో వాటి పర్యవేక్షణలో పనులు చేయటంవల్ల రైతులే స్వయంగా పనులు దగ్గరుండి చేయించుకోటానికి అవకాశం ఏర్పడుతుంది.

గతంలో నిధుల మంజూరు విషయంలో ఒక తిరకాసు ఉండేది. ఓ.అండ్.ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) కింద వసూలయిన నీటి తీరువా మొత్తాలు మంజూరుచేస్తే కాల్వలపై కష్టాలు ఉండేవి కాదు. అయితే ఈ ఐదేళ్లలో ఏటా నీటిపారుదల శాఖ ఎంత ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం మాత్రం రూ. 15కోట్ల నుంచి రూ. 20 కోట్లలోపే మంజూరుచేసి చేతులు దులుపుకునేది. వీటిని చివరి నిముషంలో ఇవ్వటంతో సగం నిధులుకూడా ఖర్చుచేసే పరిస్థితి ఉండేది కాదు. ఆ మొత్తం నాయకులు జేబుల్లోకే చేరేవి. అయితే ఇప్పుడున్న కాల్వల పరిస్థితుల దృష్ట్యా ఈ సీజన్‌కు నీటిపారుదల శాఖ పంపిన రూ. 40 కోట్ల ప్రతిపాదనల మొత్తాన్నీ ఎటువంటి కోత విధించకుండా ఆమోదించితేనే కాల్వలపై ఏళ్లతరబడి ఉన్న కష్టాలు గట్టెక్కేది. అవసరమైతే వీటికి మించిన నిధులు కూడా మంజూరు చెయ్యాల్సిన పరిస్థితి ఉంది. సాగునీటి సంఘాలు ఈమధ్యే రావటంతో పూర్తిస్థాయిలో పనులను గుర్తించలేకపోయారు. అందువల్ల అదనపు నిదులు మంజూరు చేయగలిగితేనే పూర్తి శాతం కాల్వలకు వదిలిన నీరు చివరి భూముల వరకు చేరే అవకాశం ఉంది.


ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీరందించే ప్రధాన కాల్వ కూడా పూడికలతో నిండిపోయిన చిత్రం


కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి బ్రాంచి కాల్వలకు నీరు వదిలేందుకు ఏర్పాటుచేసిన షట్టర్‌కు అడ్డుగా రాళ్లు, చెత్త పేరుకుపోయిన చిత్రం


రేపల్లె దగ్గర ఇసుకపల్లి చానల్ కట్టలు జారిపోవటంతో వాటికి అడ్డుగా వేసిన ఇసుక మూటలు కూడా కాల్వలోకి జారిపోయి చెల్లాచెదురుగా నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న చిత్రం

సమన్వయంతో సాగండి

● పీవోలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి


ఎన్నికల నిర్వహణపై జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, అబ్జర్వర్, డీఆర్‌వో

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను సమన్వయం చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పరిశీలకురాలు వీ కరుణ, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఓటర్లలో మరింతగా నమ్మకం పెంచేందుకే ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ కేంద్రంలోను పరిశీలకుల తరుపున మైక్రో అబ్జర్వర్లను నియమించటం జరిగిందన్నారు. మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ అధికారులు పోలింగ్ డే ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవటం, పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ, తిరిగి మెటీరియల్ రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు అన్ని ప్రక్రియల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ డేకి ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు తీసుకున్న మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రిసైడింగ్ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సహకారం అందించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కేంద్రాల నుంచి పూర్తి రక్షణతో రిసెప్షన్ కేంద్రాలకు తరలించి, కౌంటర్లలో అప్పగించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు పర్యవేక్షించాల్సిన అంశాలను పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ బాక్స్‌ను పోలింగ్‌కు సిద్ధం చేయడం, సీలు చేసే ప్రక్రియ పైన హ్యాండ్స్ ఆన్ శిక్షణను అందించారు.

గుడ్డుకాయ స్వాహా

పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చికెన్ మేళాకు పోటెత్తిన జనం



చికెన్ మేళాలో పట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్‌లో చికెన్ ఫ్రై తింటున్న ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్, భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో రెండు వారాలుగా ముక్కకి.. ముద్దకి దూరంగా ఉన్న వారంతా కరువు తీరా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని పిలుపునిచ్చారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య, డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అన్ని కథనాలను నమ్మాల్సిన పని లేదని చెప్పారు. మాంసం, గుడ్లు తినటం వల్ల పౌష్టికాహార లోపాలు ఉండవని చెప్పారు. లేనిపోని అపోహలు విడనాడాలని పిలుపునిచ్చారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు లేవని చెప్పారు. ప్రజలు లేని పోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు ఈ ఫుడ్ మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. భయం విడనాడాలని, సోషల్ మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ నేతలు ఎం. కిషోర్ బాబు, సురేష్, నాగేశ్వరరావు, రేణుక, గిరి, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.


చికెన్ బిర్యానీ, కోడిగుడ్లు తింటున్న యువకులు

బ్యాంకులను బతికించండి

● గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్న విధానాలకు కేంద్రం వెంటనే స్వస్తి పలికి బ్యాంకులను బతికించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది. బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యూనియన్స్ నేతలు మాట్లాడుతూ 5 రోజుల బ్యాంకింగ్ అమలు, పరిపూర్ణ సిబ్బంది నియామకం , శాంతియుత పని వాతావరణం , సంస్కృతి స్థాపన, అనాగరిక ప్రజల దాడుల నుండి బ్యాంకు ఉద్యోగుల రక్షణ , గ్రాట్యుటీ చట్ట సవరణ చేసి పరిమితిని రూ.25 లక్షలకు పెంపు, సిబ్బంది సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయ పన్ను మినహాయింపు తదితర డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపాలని అన్నారు. బ్యాంకింగ్ పరిశ్రమలో అన్యాయ కార్మిక విధానాల ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు సర్కిల్ ప్రాంతీయ కార్యదర్శి కేఆర్ జయ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే కోటిరెడ్డి, యూనియన్ సలహాదారు కిషోర్ కుమార్, అధ్యక్షుడు రవి చంద్రారెడ్డి, కార్యదర్శి సయ్యద్ మొహమ్మద్ బాషా , రాష్ట్ర అధ్యక్షుడు ఎం సాంబశివరావు, ప్రాంతీయ కార్యదర్శి ఎం రాంబాబు, ఎ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

రేపటి నుంచి అమరేశ్వరుని బ్రహ్మోత్సవాలు


అమరేశ్వరస్వామి మూలవిరాట్

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన ప్రసిద్ధ శైవ ఆరామంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగా చేయడం, 24న రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుహోమం, పర్యగ్నికరణం, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు ఆలయ వేదపండితుల మంత్రోశ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ నిర్వహించనున్నారు. 25న మండప పూజ, నిత్యోపాసన, బలిహరణ, పులి వాహనసేవ, పల్లకీ గ్రామోత్సవం జరగనుంది. 26న ఉదయం 8 గంటలకు రుద్రహోమంతో పాటు రోజువారి పూజలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు స్వామి వారి మూల విరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లింగోద్భవ అభిషేకం జరుగుతుంది. అర్ధరాత్రి 1 గంటకు స్వామివారి ఎదురు కోల సేవా మహోత్సవం, తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 27 ఉదయం 9 గంటలకు చిలుక, నంది, మిద్దె రథ వాహనాలతో స్వామివార్ల గ్రామోత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల దివ్యరథోత్సవం జరుగుతుంది. మార్చి 1న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణతో ఉత్సవాలు ముగుస్తాయి. 4 వరకు స్వామివారికి ప్రత్యేక సేవలు ఉంటాయి.

ఉలిక్కి పడుతున్న మైనింగ్ దొంగలు!

● విచారణ ప్రారంభం కావడంతో అక్రమార్కులలో కలవరం

● వెలుగుచూస్తున్న అక్రమాలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో లభించే ఎర్ర గ్రావెల్ కోట్ల రూపాయల వర్షం కురిపించడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితుల భూములను చెరబట్టి మరీ అక్రమార్కులు చేసిన అక్రమ మైనింగ్ బాగోతాలు నేడు బయట పడుతున్నాయి. వీరనాయకుని పాలెం గ్రామంలో 1983లో ప్రభుత్వం 60 ఎకరాల అసైన్డ్ భూమిని దళిత రైతులకు జీవనోపాధి కోసం డీకే పట్టాల రూపంలో అందజేసింది. అయితే 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అసైన్డ్ పంట భూములు కనుమరుగై క్వారీ గుంతలుగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాల గుట్టు నేడు విచారణతో బయట పడుతుంది. దళితుల అసైన్డ్ భూములు నామరూపాలు లేకుండా పోయాయని విచారణకు వచ్చిన అధికారులే అవాక్కు అవుతున్నారు. గతంలో ఈ భూములలో సపోట, జామ వంటి పండ్ల తోటలతో పాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు అవుతుండేవి, ప్రస్తుతం ఈ భూములలో ఎటు చూసిన క్వారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. ఎర్ర గ్రావెల్ లక్షలాది క్యూబిక్ మీటర్‌ల మట్టిని తవ్వి తరలించుకుపోయినట్లు గనుల శాఖ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో పర్యావరణ, వాల్టా చట్టాలు అమలు చేయకుండా నిబంధనలు తుంగలో తొక్కి గ్రావెల్ తవ్వకాలు సాగించినట్లు గుర్తించారు.

● దళిత రైతులకు బెదిరింపులు

దళిత రైతులపై సాగించిన దౌర్జన్యకాండ నేడు వెలుగు చూస్తుంది. అసైన్డ్ భూములలో రాత్రికి రాత్రి పాగా వేసి మట్టి తరలించుకుపోయారు. గ్రావెల్ తవ్వకాలు విషయం తెలుసుకున్న పలువురు దళిత రైతులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయగా సర్వత్రా బెదిరింపులు, దౌర్జన్యాలే వారికి ఎదురయ్యాయి. ఒక అడుగు ముందుకు వేసిన మైనింగ్ మాఫియా దళిత రైతుల భూములలో వారి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు సాగించడమే కాకుండా పోలీసులను పెట్టి అక్రమంగా నిర్బంధించిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు, రెవెన్యూయంత్రాంగం సైతం మైనింగ్ మాఫియాకే కొమ్ము కాయడంతో దళిత రైతులు ఆవేదన చెందారు. వైసీపీ పాలకులు దళిత రైతులను పిలిపించి బెదిరించడమే కాకుండా వారిని ఆ ప్రాంతాల నుంచి బలవంతంగా వెళ్లగొట్టారు. దళిత రైతులు అప్పటి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలు అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి.

● ధూళిపాళ్ల అలుపెరగని పోరాటం

గ్రావెల్ మాఫియా ఆగడాలతో విసిగెత్తిన పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో స్వయంగా ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రంగంలోకి దిగారు. గ్రావెల్ మాఫియా ఆగడాలను బయట పెట్టేందుకు ధూళిపాళ్ల చేయని ప్రయత్నం లేదు. క్వారీల సందర్శనకు వెళ్లడానికి ప్రయత్నించిన ప్రతిసారి నరేంద్రకుమార్‌కు ప్రభుత్వం నుంచి ప్రతిఘటనే ఎదురయింది. అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టుల పేరుతో నరేంద్రకుమార్‌ను ఆప్రాంతానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకునేవారు. వీటిని సమర్థంగా ఎదుర్కొంటూనే నరేంద్ర కుమార్ క్వారీల వద్దకు చేరుకుని అక్రమ మైనింగ్ గుట్టును బయటపెట్టారు. మైనింగ్ జరిగిన ప్రాంతాలలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి టీడీపీ నేతలతో పాదయాత్ర జరిపి రాత్రి వేళ క్వారీ భూముల లోనే నిద్రించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. డ్రోన్ విజువెల్స్ సహాయంతో మైనింగ్ విధ్వంసాన్ని కేజీఎఫ్ పేరుతో విడుదల చేశారు.సుమారు 700 ఎకరాలలో రూ.2 వేల కోట్ల ఎర్ర గ్రావెల్ తవ్వకాలు సాగాయని టీడీపీ నిజనిర్ధారణ కమిటీ ప్రకటించింది. అంతేకాకుండా నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం నరేంద్రకుమార్ పోరుబాటకు సంఘీభావం తెలిపి అధికారంలోకి రాగానే కేజీఎఫ్ తరహాలో జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరుపుతామని ప్రకటించారు. నేడు సబ్‌కలెక్టర్ స్థాయి విచారణ ప్రారంభం కావడంతో అక్రమాల లోగుట్టు వీడుతుందని చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


మట్టి తవ్వకాలపై నిరసన తెలిపిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను క్వారీ నుంచి అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు (ఫైల్)



వీరనాయకునిపాలెంలో మట్టి తవ్వకాలను అడ్డుకున్న దళితులు (ఫైల్)

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు వరికపూడిశెల ప్రాజెక్టుపై రౌండ్‌టేబుల్ సమావేశం

వినుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టాలని కోరుతూ స్థానిక సీపీఎం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు నల్లపాటి రామారావు, బీసీ నాయకులు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 24నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశంల్లో వరికపూడిశలకు నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టి ఆ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి వామపక్ష పార్టీలు, రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, దళిత గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గార్డ్స్ సంస్థ, రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబులను ఘనంగా సత్కరించారు. సంస్థ డైరెక్టర్ దాసరి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు గేరా యాకోబు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు పలికిన పలుకులు మన తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఏ వేమనరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం రత్నజ్యోతి, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం డోలి మోతలపై స్పందించాలి: శ్రీను నాయక్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక, వైద్యం అందక, అనారోగ్యంబారినపడి గిరిజన ప్రజలు మృతి చెందుతున్నారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి శ్రీను నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గిరిజన మహిళ మృతి చెందిందన్నారు. డోలి మోతలు లేని గ్రామాలను చూస్తారని చెప్పిన కూటమి ప్రభుత్వం దీనికి ఏం చెబుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం గిరిజన మహిళ మృతిపై స్పందించి, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో తక్షణమే రోడ్డు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

● ఏఐ సదస్సులో షణ్ముఖ్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఐబీఎం కంపెనీ రిసోర్స్‌పర్సన్ బీ షణ్ముఖ్ అన్నారు. శుక్రవారం స్థానిక కేసానుపల్లిలోని ఎంఎఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐబీఎం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ బీ షణ్ముఖ్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రతిరంగంలో వ్యాప్తిచెందిందన్నారు. వర్క్‌షాప్ అనంతరం టెస్ట్ నిర్వహించి ఐబీఎం కంపెనీ నుంచి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ జె రవిశంకర్, నవీన్, రాధిక, సితార, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్‌గా జానపాటి వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జానపాటి వెంకటేశ్వరరావును జనరల్ సెక్రటరీ చంద్రజిత్‌యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఏ ఏమండి అభినందించారు.

కేర్ పబ్లిక్ స్కూల్‌లో మాతృభాషా దినోత్సవం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేర్ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు పద్యాలు అలపించిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గండికోట అనంత కోటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు సుధారాణి, స్వరూప, పాఠశాల డైరెక్టర్ కేసరి కోటిరెడ్డి, కరస్పాండెంట్ సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు యడ్లపాడులో వైద్య శిబిరం

యడ్లపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాసట (సామాజిక సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో షుగర్, బీపీలకు వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ లింగమల్లు మోహన్‌భాస్కర్, జూనియర్ వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. అంతేగాకుండా రెండు నెలలకు సరిపడ మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాల వద్ద ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

● పోస్టుమార్టం రూం వద్ద తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు

● వైద్యశాల సమీపంలో కొమ్మల రాపిడికి తరచూ నిప్పురవ్వలు

● అధికారులు స్పందించాలని పలువురి డిమాండ్

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ ప్రభుత్వం వైద్యశాల సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. గత కొంత కాలంగా చెట్టు కొమ్మలు విద్యుత్ స్తంభానికి తాకడంతో నిత్యం కొమ్మల రాపిడికి తరచూ నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా వైద్యశాల ఆవరణలోని పోస్టుమార్టం గది సమీపంలో, వైద్యశాల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందికి వేలాడుతూ ఉన్నాయి. పుట్టెడు దుఃఖంతో పోస్టుమార్టం రూమ్ వద్దకు వచ్చే బాధితులు వేలాడుతున్న తీగలతో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వినుకొండ నరసరావుపేట రోడ్డులోని కాలవకట్ట వద్ద విరిగిన విద్యుత్ స్తంభం కారణంగా విద్యుత్ తీగలు కిందకు వాలడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం రూమ్ వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు, వైద్యశాల పక్క వీధిలో చెట్లు కొమ్మల మధ్య ఉన్న విద్యుత్ స్తంభం

రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయం పునఃనిర్మాణ పనుల వివరాలను తెలుసుకుంటున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రామలింగేశ్వరస్వామి దేవాలయం, ఘాట్‌రోడ్డు, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణ ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ, దేవదాయ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి శుక్రవారం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పరిశీలించారు. దేవాలయ అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు నాయుడు రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. దేవాలయం, ఘాట్‌రోడ్డు, గిరిప్రదక్షణ రోడ్ల నిర్మాణంతో పాటు రామలింగేశ్వరస్వామి కొండ చరిత్ర భక్తులకు తెలిసేలా దేవతామూర్తుల విగ్రహాలు, సన్నివేశాల రూపాలను ఏర్పాటు చేయడం, కళ్యాణ మండపం, యాగశాల, అఖండ జ్యోతి, షాపులు, కొండ చుట్టూ పచ్చదనం, వివిధ అభివృద్ధి పనులు చేపట్టి ఆధ్యాత్మిక క్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి షకీలాతో పాటు టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి

జోరుగా కూటమి నేతల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తదితరులు

వినుకొండ, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి) కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక బార్ అసోసియేషన్ బిల్డింగ్‌లో న్యాయవాదులను కలిసి శుక్రవారం విజ్ఞప్తిచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేఎస్ ఎంవీ నాయుడు, సీనియర్ న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సైదారావు, ఏజీపీ జ్ఞానేశ్వరరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, ఎంవీ అప్పారావు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరవిందబాబు ప్రచారం

నరసరావపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి సమస్యపై అవగాహన, అనుభవం కలిగిన ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, కనుమూరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయబాబులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజాసమస్యలు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడే వ్యక్తి ఆలపాటి అని, ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్య ఓటువేసి అత్యధిక మెజార్టీతో ఆలపాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షకీలా, కోటేశ్వరరావు, వినుకొండ ఎమ్మెల్సీ పరిశీలకులు జనార్ధన్‌రావు, సాగర్, యోగయ్య, జనసేన నాయకులు గండికోట మణికంత, అడపాల అనిల్‌కుమార్, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగశ్రీనురాయల్, వేదికపై జీవీ

ప్రత్తిపాటి ప్రచారం

చిలకలూరిపేట, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువత తమ భవిష్యత్‌తో పాటు రాష్ట్రం గురించి ఆలోచించే నాయకుడికి అండగా నిలవాలని, తాత్కాలిక ప్రయోజనాలు, భావోద్వేగాలకు అతీతంగా కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ప్రసన్న లక్ష్మి విద్యాలయం, బీఆర్‌ఐజీ పాఠశాల, నిఖిల, రోహిణి డిగ్రీ కళాశాలలు, మోడరన్ కళాశాల, ఏఎంజీ విద్యాసంస్థలలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, మద్దుమాల రవి, మక్కెన నరసింహారావు, ఇనగంటి జగదీష్ పాల్గొన్నారు.



ఆలపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి, కూటమి పార్టీల నాయకులు

● కాగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫోరం వ్యవస్థాపకులు జాఫర్ ఆధ్వర్యంలో పలు ప్రవేట్ పాఠశాలలలో మహిళా ఉపాధ్యాయులతో కలిసి ఎన్నికల కరపత్రం ఆవిష్కరించి, ఓటుపై అవగాహన కల్పించారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేయాలని కోరారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ను మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సుగుణ, శ్రీలక్ష్మి తదితర మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్ల, వీ అప్పాపురం, మారెళ్ళవారిపాలెం, తలార్లపల్లి, చింతలచెరువు, లక్ష్మీపురం, రాముడుపాలెం తదితర గ్రామాల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ డీఎల్‌డీఏ అధ్యక్షుడు లగడపాటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ముండ్రు సుబ్బారావు, గంగినేని ఆంజనేయులు, వంకాయలపాటి పేరయ్య, బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్, కుంటా కోటిరెడ్డి, బత్తుల సుబ్బారావు, గంగినేని రాధాకృష్ణమూర్తి, జెక్కిరెడ్డి అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రులంతా ఓటు వేసి గెలిపించాలని శావల్యాపురం మండల టీడీపీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆలపాటికి మద్దతుగా కారుమంచిలో గురువారం రాత్రి టీడీపీ నాయకులు విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, వినుకొండ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు గోపాళం శివయ్య, కారుమంచి ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల వెంకట్రావు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య, యువ నేత యర్రబిక్కి అజిత్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో 'ఫ్రైడే - డ్రై డే'

వినుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో దోమల నివారణకు పురపాలక సంఘంలోని 12 సచివాలయాల పరిధిలో శుక్రవారం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఫ్రైడే - డ్రైడేలో భాగంగా ప్రజలు తమ వంతు బాధ్యతగా వారి ఇంటి చుట్టూ పరిసరాలల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వృద్ధిని నివారించేందుకు ఎప్పటికప్పుడు నీటితొట్లు, వాటర్ ట్యాంక్‌లు, ప్రతివారం శుభ్రపరిచి ఎండబెట్టుకోవాలన్నారు. అలాగే ఇంట్లో ఉన్న కూలర్లు, ఫ్రిడ్జ్‌లు ఇంటి చుట్టు పరిసరాల్లో ఉన్న కొబ్బరి బోండాలు, పాత టైర్లు, రోళ్ల మొదలైన వాటిలో నీటిని నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ సచివాలయాల సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నూజెండ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపుతప్పి వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని ముప్పరాజువారిపాలెం సమీపంలో శుక్రవారం ఉదయం జరిగింది. నూజెండ్ల గ్రామానికి చెందిన ఏసోబు తన మోపెడ్‌పై ముప్పరాజువారిపాలెం వెళుతుండగా మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ద్వారా వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



పాఠశాల వద్ద ఎరువు దిబ్బలు తొలగించిన ప్రదేశం

పాఠశాల వద్ద ఎరువు దిబ్బల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఈపూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద ఎరువు దిబ్బలు ఉండడంతో విద్యార్థులు, ఆప్రాంత వాసులు పడుతున్న అవస్థలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం దిబ్బలను తొలగించి, ఆ ప్రదేశంలో మట్టి చదును చేసి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

● కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను తదితర మొత్తాలు వేగవంతంగా వసూలు చేసి, నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు శుక్రవారం ఆదేశించారు. పన్ను వసూళ్లపై మునిసిపల్ రెవెన్యూ అధికారి పి సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గిరి,అబ్దుల్ ఖాదర్‌తో ఆయన సమీక్షించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీల వసూళ్ల కోసం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించేందుకు వార్డు సచివాలయ కార్యదర్శులను సమన్వయం చేసుకుని వ్యవహరించాలన్నారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీచేసి, నిర్దేశించిన సమయంలోపు బకాయిలు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొండి బకాయిదారులను గుర్తించి మునిసిపల్ చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా సచివాలయాల పరిధిలోని నూతన భవనాలను గుర్తించి వాటిని ఆస్తిపన్ను పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



హోం మినిస్టర్ అనితకు వినతి పత్రం అందజేస్తున్న సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులు, పక్కన ఎమ్మెల్యే చదలవాడ

బాధితులకు న్యాయం చేయాలి

● హోం మినిస్టర్ అనితకు చిట్‌ఫండ్ బాధితుల వేడుకోలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని హోం మినిస్టర్ వంగలపూడి అనితను బాధితులు వేడుకున్నారు. శుక్రవారం నరసరావుపేట నుంచి ఎమ్మెల్యే డాక్టర్ చదవాడ అరవిందబాబుతో కలిసి పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయ నుంచి వాహనాలలో విజయవాడ తరలివెళ్లారు. విజయవాడలోని హోంమంత్రి అనితను ఆమె గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ సాయి సాధన చిట్ ఫండ్ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. విచారణ కోసం ప్రభుత్వం సిట్‌ను నియమించిందన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చిట్ సభ్యులు, డిపాజిట్‌దారులను మోసగించిన విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చాలా సీరియస్ ఉందన్నారు. అందరికీ న్యాయం జరిగేదానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా ఈ ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కోసం బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డ్యూటీ నేతృత్వంలో 12మంది సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ బృందం పట్టణానికి రానుంది ఈ బృందం ఇప్పటివరకు అధికారికంగా పోలీసులు పరిగణించిన 691మంది బాధితులకు నోటీసులు జారీచేసి వారి నుంచి వాంగ్మూలాలు నమోదు చేసుకొని దర్యాప్తును వేగవంతం చేసే అవకాశం ఉంది.

విప్పర్ల, రొంపిచర్ల గ్రామాల్లో ఆర్డీవో పరిశీలన



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో మధులత

రొంపిచర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజోతి): మండలంలోని విప్పర్ల, రొంపిచర్ల గ్రామాల్లో ఆర్డీవో మధులత శుక్రవారం పర్యటించారు. విప్పర్ల గ్రామంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకున్న వారి వివరాలను పరిశీలించారు. అదే విధంగా రొంపిచర్లలో గతంలో ఇచ్చిన స్థలాల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివరాల సేకరణ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆమెవెంట తహసీల్దార్ బండి నిర్మల, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోటప్పనగర్, హస్సనాయునిపాలెంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ దేవాలయం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దేవాలయంలో పొంగళ్లు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆంజనేయులుతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



శివయ్య స్థూపం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కార్మికులను రెగ్యులర్ చేయాలి

● శివయ్య స్థూపం వద్ద ఏఐటీయూసీ నిరసన

వినుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లులలో పనిచేస్తున్న కార్మికులకు రెగ్యులర్ చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శివయ్య స్థూపం సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 110 మున్సిపల్, 16నగర, కార్పొరేషన్లులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వాటర్ స్కీమ్, కరెంట్ తదితర కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు, కార్మికులకు ఇచ్చిన హామీమేరకు సమాన పనికి సమానవేతనం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని లేకుంటే విడతల వారీగా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజక వర్గం ఏఐటీయూసీ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సంపెంగుల అబ్రహం, రాజు రావెళ్ల శ్రీనివాసరావు, పచ్చిగొర్ల ఏసు, నాగూర్, ఏసుపాదం, మోషె, పెద్దేటి స్వామి, రాముడు, గాలయ్య, మరియదాసు, సుభాని, వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.